సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



'దానా'పై అప్రమత్తం

దానా తుఫాన్ సన్నద్ధతపై కలెక్టర్ సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- 8లో



కదం తొక్కిన విద్యార్థులు

టెక్కలి విద్యార్థులు కదం తొక్కారు. నగదు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- 8లో

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 11న గీతా జయంతి పురస్కరించుకొని భగవద్గీతలోని ఆరో అధ్యాయం 'ఆత్మ సంయమన యోగం'పై పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9866914160ను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఇంటర్ విద్యార్థినుల ఆచూకీ లభ్యం



కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ అవతారం

జి.సిగడాం: మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలు ప్రహరీ దూకి ఈ నెల 21న అదృశ్యమయ్యారు. వారి ఆచూకీ లభ్యమైంది. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ పోలీసులకు వీరు కంటపడ్డారు. వారు బాలికల వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే జి.సిగడాం ఎస్‌ఐ మధుసూదనరావుకు సమాచారం అందజేశారు. దీంతో హుటాహుటిన రైల్వేస్టేషన్‌కు వెళ్లి బాలికలను సీడబ్ల్యూఎస్ కేంద్రానికి తీసుకెళ్లి కౌన్సెలింగ్ చేయించారు. సాయంత్రం వారిని జి.సిగడాం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

స్కూల్ బస్‌ను ఢీ కొట్టిన ఇసుక ట్రాక్టర్



మండలంలోని రామచంద్రపురం వద్ద స్కూల్ బస్సును ఢీకొట్టిన ఇసుకట్రాక్టర్

ఆమదాలవలస: మండలంలోని వంశధార నదీ తీరం చెవ్వాకులపేట నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ మండలంలోని రామచంద్రపురం గ్రామం వద్ద మంగళవారం ఒక ప్రైవేటు స్కూల్ బస్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ అతి వేగంతో ప్రయాణించడంతో ఈ ప్రమాదం జరిగిందని రామచంద్రపురం గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఆ సమయంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు ముందు భాగానికి కాకుండా వెనుక భాగానికి ట్రాక్టర్ ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో విద్యార్థులు కూడా తక్కువ మంది ఉండడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్లు అతివేగంతో వాహనాలు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

● పలాస - కాశీబుగ్గ గ్యాంగ్ రేప్ ఘటన

ఎఫ్ఐఆర్ నమోదుకు 40 గంటలా..?



పలాసలో ఇద్దరు బాలికలపై లైంగికదాడి ఘటనపై అనుమానాలు బలపడుతున్నాయి. ఘటన జరిగిన 40 గంటల వరకు ఎఫ్ఐఆర్ వేయకపోవడం, రాజీ యత్నాలకు రాజకీయ నాయకులు ప్రయత్నించడం, విషయం బయటకు పొక్కగానే హడావుడిగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం, నిందితుల కుటుంబ సభ్యులు అధికార పార్టీ నేతల కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వంటి అంశాలన్నీ వెలుగు చూస్తున్నాయి. దీనిపై మహిళా సంఘాలతో పాటు విపక్ష నాయకులు కూడా తీవ్రంగా స్పందిస్తున్నారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా చేసి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

● అత్యాచార ఘటనపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహం ● నిందితుల్ని కఠినంగా శిక్షించాలంటున్న ప్రజలు ● న్యాయం జరిగేవరకు అండగా నిలుస్తామంటున్న ప్రజాప్రతినిధులు

● కూటమిది ఆటవిక పాలన

● రాష్ట్రంలో మహిళలపై వరుసగా హత్యలు, అత్యాచారాలు
● 120 రోజుల పాలనలో కూటమి ఘనత ఇదే
● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆటవిక పాలన సాగిస్తోందని, 120 రోజుల పాలనలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు తప్ప ఏమీ కనిపించడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 74 మంది యువతులు, బాలికలపై అత్యాచారాలు. హత్యలు జరిగాయని అన్నారు. హత్యలు, అత్యాచారాలు నిరోధించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. పలాసలో ఇద్దరు బాలికలపై జరిగిన లైంగిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇలాంటి సంఘటన జరగడం విచారకమరమని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దిశ పేరున ప్రత్యేక యాప్ రూపొందించి మహిళలకు భద్రత కల్పించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి నేతలు విఫలమయ్యారు. అతిసార వ్యాధితో ప్రజలు చనిపోవడాన్ని ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామని తెలిపారు. - నరసన్నపేట

● అరాచక పాలన



కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన మండలంలోని జక్కర గ్రామంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో ఇప్పటివరకు ఎంతోమంది మహిళలు హత్యలు, అత్యాచారాలకు గురయ్యారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను డైవర్ట్ చేయడానికి రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తూ పోలీసులకు అడ్డంగా పెట్టుకొని రెడ్‌బుక్ పరిపాలన అమలు చేస్తున్నారని అన్నారు. ఆడపిల్లలపై చేయి వేయడానికి భయపడేలా తాటతీస్తా అన్న పవన్ కల్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. - కంచిలి

● నిందితులను కఠినంగా శిక్షించాలి

పలాస సూదికొండ కాలనీకి చెందిన ఇద్దరు బాలికలను అత్యాచారం చేసిన ముగ్గురు యువకులను కఠినంగా శిక్షించాలని ఉత్తరాంధ్ర మహిళా సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం బాధితుల కుటుంబాన్ని కలిసి సంఘీభావాన్ని ప్రకటించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఘటనకు ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలని చెప్పారు. -పలాస

● ఏఐఎస్ఎఫ్ వినతి

పలాసలో బాలికలపై లైంగికదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవికుమార్ ఆధ్వర్యంలో కాశీబుగ్గ పోలీసులకు వినతిపత్రం అందించారు. గంజాయిని నిషేధించడంలో ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, గంజాయితో పాటు మద్యం ఏరులై పారుతోందని అన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో కేసును నీరుగార్చకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. - కాశీబుగ్గ



కాశీబుగ్గ పోలీసులకు వినతి అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు

● అకృత్యాలు పెరుగుతున్నాయి

పలాస లైంగికదాడి ఘటనలో నిజ నిర్ధారణ కోసం బాధిత కుటుంబసభ్యులతో పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం సంఘాల సభ్యులు మాట్లాడారు. వారు మాట్లాడుతూ నేడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ అన్ని ప్రాంతాలలో స్త్రీలపై దాడులు పెరుగుతున్నది వాస్తవమని అన్నారు. నేరానికి పాల్పడిన ఆ ముగ్గురిపైన పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్, సభ్యులు తెప్పల ఢిల్లీరావు, పోతనపల్లి వైకుంఠరావు, మద్దిల పోలారావు తదితరులు పాల్గొన్నారు. - కాశీబుగ్గ

● ఎందుకంత తాత్సారం



కాశీబుగ్గ స్టేషన్‌లో పోలీసులను వివరాలు అడుగుతున్న మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు


అత్యాచార ఘటన జరిగి నలభై గంటల వరకు ఎఫ్ఐఆర్ వెయ్యకుండా ఎందుకంత తాత్సారం చేశారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. ఆయన మంగళవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. అనంతరం బాధితుల ఇంటికి చేరుకుని వారికి ధైర్యం చెప్పారు. న్యాయ పోరాటంలో తాము అండగా ఉంటామని చెప్పారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, ఎంపీపీ డొక్కరి దానయ్య, పీఏసీఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, సీనియర్ నాయకులు ఉంగ సాయికృష్ణ, కౌన్సిలర్లు పిచ్చుకల అజయ్‌కుమార్, గుజ్జు జోగారావు, అంబటి ఆనందరావు, ఎంపీటీసీ గండు మోహనరావు, దువ్వాడ రవి తదితరులు పాల్గొన్నారు. - కాశీబుగ్గ

● ప్రభుత్వానిదే బాధ్యత



కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఆడవారిపై దాడులు పెరిగాయని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలాస ఘటనకు చంద్రబాబు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఆడవారికి అన్యాయం జరిగిపోతోందని, మిస్సింగ్ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 74 మంది అభాగ్యులుగా మారిపోయారని, వీరికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మహిళా సంక్షేమం కోసం దిశ యాప్, దిశా పోలీసు స్టేషన్‌లను తీసుకువచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. రాష్ట్రంలో దిశ యాప్, దిశా పోలీసు స్టేషన్లు ఉన్నాయా? అని ప్రశ్నించారు. - ఎల్.ఎన్.పేట

కొన్నవారికే కొలువు



● కేజీబీవీ పోస్టులను పంచుకున్న నేతలు
● అంగడి సరుకుగా విక్రయాలు
● సమగ్ర శిక్షా అభియాన్‌లో జరుగుతున్న నియామకాలపై తీవ్ర విమర్శలు
● ఉద్యోగాలు ఎవరికివ్వాలో డిసైడ్ చేసి.. అందుకు తగ్గట్టుగా భర్తీ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

నోటిఫికేషన్ ఇస్తారు.. కానీ నిబంధనలు పాటించరు. కొలువులు భర్తీ చేస్తాం రమ్మని పిలుస్తారు.. కానీ తమ వారికి తప్ప ఇంకెవరికీ పోస్టు ఇవ్వరు. ఉద్యోగాలు ఎవరికి ఇవ్వాలో ముందుగానే నిర్ణయించుకుని ఆ దిశగా నియామక ప్రక్రియ చేపడుతున్న వింత సంస్కృతి సమగ్ర శిక్షా అభియాన్‌లో కనిపిస్తోంది. నియోజకవర్గాల వారీగా నేతలకు పోస్టులు పంచి పెట్టి నియామకాల పేరుతో ఆటలాడుతున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు సంబంధించిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది.

అంగడి సరుకుగా కేజీబీవీ పోస్టులు

జిల్లాలో భర్తీ చేయబోతున్న 38 కేజీబీవీ పోస్టులు అంగడి సరుకుగా మారిపోయాయి. పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయి. వాటికి రేటు పెట్టి విక్రయిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లోనే డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఏ పోస్టు ఎవరికో డిసైడ్ చేసేశారు. దాన్ని అమలు చేసే బాధ్యతను అధికారులకు అప్పగించారు. వారికి సెట్ అయ్యేలా నిబంధనలను ఉన్నత స్థాయిలోనే రూపొందించి, వాటిని ఆచరణలో పెడుతున్నారు. ఈ క్రమంలో అర్హులైన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. తమకు అన్యాయం జరుగుతోందని, పోస్టుల నియామకాల్లో మోసం జరుగుతోందని గగ్గోలు పెడుతున్నారు.

అడ్డగోలు నిబంధనలు..

● అభ్యర్థుల మార్కుల ప్రకారం మెరిట్ లిస్టు తయారు కాలేదు.
● సాఫ్ట్‌వేర్ లోపాల ముసుగులో జాబితా అస్తవ్యస్తంగా తయారు చేశారు.
● మెరిట్ జాబితా తర్వాత ఎంపికైన టీచింగ్ సిబ్బందికి డెమో నిర్వహించాలి. దీన్ని కూడా తీసేశారు.
● తమకు కావల్సిన వారి కోసం మెరిట్ జాబితాను 1: 20 నిష్పత్తిలో విడుదల చేశారు.
● ఈక్రమంలో మెరిట్‌లో చివరన ఉన్న వారు కూడా ఎంపికవ్వడానికి అవకాశం ఉంటుంది.
● ఇక, సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వకుండా వ్యూహాత్మకంగా తప్పిస్తున్నారు.
● గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసిన వారికి అనుభవం ప్రకారం, టీచింగ్ చేస్తున్న వారిలో వయస్సు ఎక్కువగా ఉంటే వారి సీనియారిటీకి అదనపు మార్కులు కల్పించాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరించారు.
● రోస్టర్‌లో కూడా చివరి నిమిషంలో మార్పు చేసేశారు. దీంతో వందలాది మంది నష్టపోయారు.

ఇలా నేతలకు కావల్సిన వారికి అనుకూలంగా నిబంధనలు పెట్టి నియామకాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగం ఎవరికో ముందే ఖరారు చేసేసి, ఆ తర్వాత నియామక ప్రక్రియ చేపడుతున్నట్టుగా ప్రస్తుతం తంతు నడుస్తోంది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దేనినీ వదలని నేతలు



ఇసుక, మద్యం, ఉపాధి పనులు టీడీపీ నేతలకు ఇవేవీ సరిపోవడం లేదు. వచ్చిన ఏ అవకాశాన్నీ వదలడం లేదు. ఆకలితో ఉన్న పచ్చనేతలకు ఇప్పుడు కేజీబీవీ పోస్టులు కడుపు నింపే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రకటన రావడమే తరువాయి ఆ పోస్టులను దక్కించుకోవడానికి పావులు కదిపారు. ఉన్నత స్థాయి నుంచే లాబీయింగ్ చేశారు. ఇంకేముంది భర్తీ చేయనున్న పోస్టులన్నీ వారి చేతుల్లోకి వెళ్లాయి. ఎవరికివ్వాలో డిసైడ్ చేసే పరిస్థితికి వెళ్లిపోయాయి. జిల్లాలో 32 టీచింగ్ పోస్టులకు, ఆరు నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి గత నెల 22వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా నోటిఫికేషన్ విడుదలయ్యాక నేతలు రంగప్రవేశం చేశారు. నియోజకవర్గాల వారీగా భర్తీ చేయనున్న పోస్టులు తమవిగా నిర్ణయం తీసేసుకున్నారు. ఆ పోస్టులు తాము చెప్పిన వారికే వచ్చేలా రంగం సిద్ధం చేశారు. అందుకు అనుకూలంగా ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు చేసి సానుకూల మార్గదర్శకాలు విడుదల చేయించుకున్నారు. తమకు కావాల్సిన అభ్యర్థులకు ఏ అర్హతలున్నాయో ఆ మేరకు నిబంధనలు రూపొందించేలా చేశారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా అమలులో ఉన్న నిబంధనలకు తిలోదకాలిచ్చేశారు. దీంతో పైరవీల ద్వారా నేతల్ని ఆశ్రయించిన వారికి తప్ప అసలైన అర్హులకు మేలు చేసే పరిస్థితి కన్పించడం లేదు.

● రండి బాబూ రండి..

ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలు మాత్రమే



కోటబొమ్మాళిలో అమ్మకానికి తెచ్చిన ఇసుక ట్రాక్టర్

కోటబొమ్మాళి: టీడీపీ వర్గీయులు నడిరోడ్డుపైనే ఇసుక వ్యాపారం మొదలెట్టేశారు. రూ.4వేలకు ట్రాక్టర్ ఇసుక అంటూ కోటబొమ్మాళి వీధుల్లో కేకలు వేస్తూ బళ్లు తిప్పుతున్నారు. మంగళవారం జలుమూరు, నరసన్నపేట మండలాల్లోని నగిరిపెంట, బుచ్చిపేట, కొమనాపల్లి, దొంపాక, గోపాలపెంట, మబుగాం ఇసుక రేవుల నుంచి వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తీసుకువచ్చి ఇలా విక్రయించారు. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ కిమ్మనలేదు.

శ్రీముఖలింగం హుండీ లెక్కింపు రేపు

జలుమూరు: శ్రీముఖలింగం ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు 24న నిర్వహించనున్నట్లు ఈఓ పి.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. ఆసక్తి గల భక్తులు హుండీ లెక్కింపు ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.

ఉప్పు భూముల పరిశీలన

సంతబొమ్మాళి: నౌపడ పరిసర ప్రాంతాల్లోని ఉప్పు భూములను ఢిల్లీకి చెందిన సెంట్రల్ పోర్ట్ డిప్యూటీ సెక్రటరీ రాజేష్ మంగళవారం పరిశీలించారు. 5076 ఎకరాల ఉప్పు భూములు మూలపేట పోర్టుకు కేటాయించాలని సాల్ట్ డిపార్ట్‌మెంట్‌ను కోరడంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అలాగే పోర్ట్ రహదారికి ఎంఎస్ కంపెనీ భూములు కేటాయించాలని యాజమాన్యంతో మాట్లాడారు. ఆయనతో పాటు సాల్ట్ డిప్యూటీ కమిషనర్ రఘు, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ రమేష్‌కుమార్, సాల్ట్ సూపర్ వైజర్ ఇస్లాం ఉన్నారు.

పోర్టు కలని నెరవేర్చింది వైఎస్ జగన్

● 70 శాతం పనులు పూర్తయితే ఇప్పుడు పునఃప్రారంభం ఏమిటో మంత్రే చెప్పాలి
● కాంట్రాక్టర్లు, ఏజెన్సీలను బెదిరించి దోచుకోవడానికి ఎత్తుగడ
● వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్



సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

సంతబొమ్మాళి: జిల్లా ప్రజల దశాబ్దాల పోర్టు కలను నెరవేర్చింది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని ఎం.సున్నాపల్లిలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 70 శాతం పోర్టు పనులు పూర్తయితే.. ఇప్పుడు పునఃప్రారంభం ఏమిటో మంత్రి అచ్చెన్నాయుడే చెప్పాలని అన్నారు. భూ సేకరణ చేయకుండా, అనుమతులు లేకుండా 2019లో తామే పోర్టు తెచ్చామమని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. మూలపేట పోర్టు నిర్మాణానికి అన్ని అనుమతులు తెచ్చింది జగన్‌మోహన్‌రెడ్డి అని, పోర్టు పనులు కూటమి ప్రభుత్వం అడ్డుకోకపోతే ఈ పాటికి మొదటి షిప్ వచ్చి ఉండేదని చెప్పారు. దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఇచ్చిన అధికారంతో కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్నత పదవులు అనుభవించిన కింజరాపు కుటుంబీకులు ఈ జిల్లాకు ఒక్క మంచి పనైనా చేశారా అని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జిల్లాలో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు.

వ్యాపారులు, తటస్థులు, వైఎస్సార్‌సీపీ వాళ్లను మద్యం టెండర్లు వేయకుండా బెదిరించి సిండికేట్‌గా మారి టీడీపీ నాయకులకు దుకాణాలు కేటాయించారని, వారి వెనుక ఎవరు ఉన్నారో త్వరలోనే బహిర్గతం చేస్తానని అన్నారు. ఫ్రీ ఇసుక ఇస్తామని చెప్పి ప్రజలను మోసగించారని, వైఎస్సార్‌సీపీ చేసిన పోరాట ఫలితంగానే ట్రాక్టర్లకు, ఎడ్ల బండికి ఫ్రీ ఇసుక అని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఇసుక, మద్యం వల్ల వచ్చిన ఆదాయంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ మోసాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, 2027లో జమిలి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి.మోహన్‌రెడ్డి, మార్పు నాగభూషణరావు, టి. నారాయణ, పంగ రామయ్య, నక్క రామ్మోహన్, సత్తారు సత్యం, చిన్ని జోగారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ మొదలైనందున రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేసి ఈ నెల 31 నాటికి ఓటరు జాబితా తయారు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్, ఎన్ఆర్జీఈఎస్ ఏపీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల అంశంలో కిందిస్థాయి సిబ్బందికి ఆర్డీవోలు శిక్షణ ఇవ్వాలని సూచించారు. హౌసింగ్‌లో స్టేజ్ కన్వర్షన్లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనకు సంబంధించి నివేదికలు పంపాలన్నారు. 70 వేల ఉపాధి పని దినాలు లక్ష్యమని చెప్పారు. పంచాయతీల్లో ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ మరమ్మతులు, స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్ అనుగుణంగా పనులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి, నీటిపారుదల శాఖ ఎస్ఈ పి.సుధాకర్, సీపీఓ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ నేవీకి ఎంపికైన గొర్రెలకాపరి కుమార్తె



వజ్రపుకొత్తూరు/రూరల్: మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బందాపు తేజేశ్వర రావు కుమార్తె బందాపు శ్రీనిధి దేశరక్షణ త్రివిధ దళంలో ఒకటైన ఇండియన్ నేవీలో ఉద్యోగానికి ఎంపికై ఆదర్శంగా నిలిచింది. మంగళవారం విడుదలైన ఎస్ఎస్ఆర్ ఫలితాల్లో సత్తాచాటింది. వచ్చే నెల 11న ఒడిశాలోని చిలక శిక్షణ కేంద్రంలో రిపోర్టు చేయనుంది. శ్రీనిధి ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాల ఎంపీఆర్ కళాశాల ఎల్ఎల్‌బీ రెండు, నాలుగు, ఎనిమిది సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. రెండు షిఫ్టుల వారీగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలను రెక్టార్ బి.అడ్డయ్య పర్యవేక్షించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు

ఆమదాలవలస: ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ని వెంటనే ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆమదాలవలసలోని ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో పెన్షనర్ల సంఘ కార్యవర్గ సమావేశం సురవరపు శిమ్మినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. పూర్వ పద్ధతిలోనే ఐఆర్‌ను పెంచాలని కోరారు. సమావేశంలో పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నవారిపై ఇకపై ఫిర్యాదులొస్తే ఉపేక్షించేది లేదని కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ (రాజమండ్రి) డాక్టర్ ఎస్.శోభారాణి స్పష్టంచేశారు. ఇక్కడి ప్రిన్సిపాల్, అధ్యాపకులు గతంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, ఆరోపణలు చేసుకున్న నేపథ్యంలో మంగళవారం ఆర్జేడీ విచారణ చేపట్టారు. తరగతి గదులు, రికార్డులు, హాజరుపట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఎంతో చరిత్ర కలిగిన కళాశాలలో పనిచేస్తున్నందుకు గర్వపడాలని, కానీ ఇక్కడ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండటం ఎంతమాత్రం సరికాదన్నారు. ఇకపై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

ఎస్ఈ స్వర్ణకుమార్ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వంశధార ఎస్ఈగా కె.వి.ఎస్.స్వర్ణకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో ఆయన మంగళవారం విధుల్లో చేరారు. ఎస్ఈకి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ప్రతి రైతుకు సాగు నీరందిస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని చెప్పారు.



దానాపై అప్రమత్తం: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. తుఫాను తీవ్రత నేపథ్యంలో ఈనెల 24 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురవనున్నాయని, సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం అధికారులకు సూచనలు జారీ చేశారు. జిల్లాలోని నదులు, వాగుల్లో ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08942-240557 ఏర్పాటు చేశామని, ప్రజలు అత్యవసర సమయంలో ఫోన్ చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. లైఫ్ బోట్లు, కూలిన చెట్లను తొలగించే యంత్రాలు, కొత్త స్తంభాలు సిద్ధంగా ఉంచుకోవాలని, తుఫాను రక్షిత భవనాలను సిద్ధం చేయాలని మళ్లీ ఆదేశాలు ఇచ్చేంతవరకు ఎవరూ వారి పని చేస్తున్న కేంద్రాలను విడిచి ఎవరూ వెళ్లరాదని, ప్రభుత్వ అధికారులకు సెలవులను పూర్తిగా రద్దు చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఒడిశాతో సమన్వయం అవసరం

జిల్లాలో ప్రవహిస్తున్న నాగావళి, వంశధార, మహేంద్ర తనయ, బహుదా నదుల్లో నదీ ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తుఫాను ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు. వీరితో పాటు జిల్లాలోని 30 మండలాల్లో తహసీల్దార్లను వారి వారి మండలాల్లో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు.

- తీర ప్రాంత మండలాలైన రణస్థలానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, పి.కిరణ్ కుమార్ (8008803800),
- ఎచ్చెర్లకు డ్వామా పీడీ, బి.సుధాకర్ రావు (8790008399),
- శ్రీకాకుళం మండలానికి జిల్లా పంచాయతీ అధికారి, కె.భారతి సౌజన్య (8341493877),
- గారకు ఐసీడీఎస్ పీడీ, బి.శాంతి శ్రీ (9440814582),
- పొలాకికి జిల్లా పరిషత్ సీఈవో, శ్రీధర్ రాజు రామన్ (9100997770),
- సంతబొమ్మాళికి జిల్లా పరిశ్రమల శాఖ, జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు (9866530885),
- వజ్రపు కొత్తూరుకు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్, పివి. శ్రీనివాసరావు (9440716028),
- సోంపేటకు కార్మిక శాఖ సహాయ కమిషనర్, అజయ్ కార్తికేయ (9492555034),
- మందసకు పశుసంవర్ధక శాఖ పలాస సహాయ సంచాలకులు, పి చంద్రశేఖర్ (9492416700),
- కవిటికి ఉద్యాన శాఖాధికారి ఆర్‌వీవీ ప్రసాద్ (7995086758),
- ఇచ్ఛాపురం మండలానికి డ్వామా ఏపీడీ సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి (6309998070)లను తుఫాను పర్యవేక్షక అధికారులుగా నియమించామని కలెక్టర్ చెప్పారు.

అలర్ట్‌గా ఉండండి: మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం: బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుఫాన్ పట్ల జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ నెల 24 నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గండ్లు పడే అవకాశమున్న చెరువులు, కరకట్టలు, కాలువలపై నిఘా ఉంచాలన్నారు. వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంచాలని చెప్పారు.

మా భూమి మాకు అప్పగించాలి



సమస్య వివరిస్తున్న బాధితులు

రణస్థలం: మండలంలోని బావరాజుపాలెం వద్ద గరుబంద చెరువులో 1974లో తమ తాత పెద్ది విజయచంద్రరావు పేరిట సర్వే నెంబర్ 10లో 1.50 ఎకరాలకు ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని, ఆక్రమణకు గురైన ఆ భూమిని తమకు అప్పగించాలని బాధితుడు పెద్దింటి వెంకటసాయికుమార్ కోరారు. ఈ విషయమై సోమవారం విజయనగరం జిల్లా గుర్ల వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మొర పెట్టుకునేందుకు తల్లి కృష్ణవేణితో కలిసి వెళ్లానని చెప్పారు. ఆ సమయంలో పవన్ కాళ్లు పట్టుకుందామని ప్రయత్నించగా ఆయన తూలిపోయారని, వెంటనే తనను కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి మంగళవారం ఆయన మాట్లాడారు. 1990 వరకు భూమి సాగు చేసి పంటలు పండించామని, కొన్ని కారణాల వల్ల తర్వాత సాగు చేయకపోవడంతో బావరాజుపాలెం గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారని వాపోయారు. ఈ విషయమై ప్రభుత్వానికి అర్జీ పెట్టినా, న్యాయస్థానాలు చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని చెప్పారు. గతంలో మంగళగిరి వెళ్లి డిప్యూటీ సీఎం పవన్‌ను కలవగా 14 రోజుల్లో న్యాయం చేస్తానని చెప్పారని, ఇంతవరకు న్యాయం జరగలేదని వాపోయారు. ఉన్నతాధికారులు న్యాయం జరుగుతుందని చెప్పినా కింద స్థాయిలో వీఆర్వో జగన్నాథం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై వీఆర్‌ఓను వివరణ కోరగా ఆ భూమి పూర్తిగా చెరువు గర్భంలో ఉందని చెప్పారు. ఇప్పటికే మార్కింగ్ వేసి విషయం చెప్పామన్నారు. అయితే చెరువు గర్భంలోనే మరికొంత మందికి పట్టాలు మంజూరు చేయడంతో సాగులో ఉన్నారని, వీరు ఎందుకు బయటకు వెళ్లిపోయారు తెలియదని వివరించారు. చెరువులో ఆక్రమణలు తొలగించి రణస్థలం పంచాయతీకి చెరువును అప్పగిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్మికులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు పెంపు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో శ్యాంక్రిగ్ పిస్టన్స్ ప్లాంట్-3 శాఖా మహాసభలో భాగంగా సీపీఎం జెండా ఎగుర వేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు నియంత్రించాలన్నారు. జమిలీ ఎన్నికల ప్రతిపాదన వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు ఎస్.వి.రమణ, గౌరీశంకర్, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి

నరసన్నపేట: రైతులు విత్తనోత్పత్తికి ముందుకు రావాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి అన్నారు. 25 ఎకరాల విస్తీర్ణంలో విత్తనోత్పత్తికి ఆసక్తి చూపితే కేవీకే ఆధ్వర్యంలో సహాయం అందిస్తామని చెప్పారు. బొరిగివలసలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ విత్తనోత్పత్తి పథకానికి రైతులు సహకరించాలని కోరారు. రైతులు విత్తనాలు పండించాక తామే కొనుగోలు చేస్తామన్నారు. శాస్త్రవేత్త అనూష మాట్లాడుతూ వరిలో సుడిదోమపై అప్రమత్తంగా ఉండాలని, ఉధృతి తక్కువగా ఉంటే ఎస్ఫేట్‌ను 200 గ్రాముల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి గింజ పాలు పోసుకొనే దశలో ఉన్నందున ఉదయం 6 నుంచి 9 గంటల లోపు, సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలన్నారు. పెసలు, మినుము విత్తనాలను కేవీకేలో కొనుగోలు చేయవచ్చన్నారు. శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ నాటుకోళ్ల పెంపకంలో జాగ్రత్తలు వివరించారు. ఏడీ రవీంద్రభారతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విధి విధానాలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.సునీత, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్ : సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ప్రజలకు సూచించారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన ఆయన కొన్ని సూచనలు చేశారు. ట్రాయ్ (టీఆర్ఏఐ)లో పనిచేస్తున్నామని, మీ మొబైల్ నెంబర్ అక్రమ కార్యకలాపాలకు సంబంధించినదని, సేవలు నిలిపివేస్తామని బెదిరిస్తారని వాటిని నమ్మవద్దన్నారు. కస్టమ్స్‌లో పనిచేస్తున్నామని, మీకొచ్చిన పార్సిల్‌లో అక్రమ పదార్థాలు, చెల్లింపు చేయాలని డిమాండ్ చేస్తారని. వాటిని పట్టించుకోవద్దన్నారు. మీ బంధువును అరెస్టు చేస్తారని చెప్పి డబ్బులు చెల్లించమని డిమాండ్ చేస్తారని, సోషల్ మీడియాలో పెట్టుబడులపై ఎక్కువ లాభాలొస్తాయని ప్రకటనలు గుప్పిస్తారని, క్రెడిట్ కార్డు పేరిట మోసాలకు పాల్పడుతుంటారని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

సైబర్ మోసాల బారిన పడితే తక్షణమే టోల్‌ఫ్రీ నంబరు1930ను గానీ, నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ (1800-11-4000) డయల్ చేయవచ్చని పేర్కొన్నారు.సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని, పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు.



నరసన్నపేట పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

నరసన్నపేట: సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. నరసన్నపేట పోలీసు స్టేషన్‌తో పాటు సర్కిల్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకు ముందు స్థానిక సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌తో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. శాంతి భద్రతల అదుపులో రాజీ పడవద్దని అన్నారు. ఆయన వెంట ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంపై

కదం తొక్కిన విద్యార్థులు



విద్యా దీవెన నిధులు విడుదల చేయాలంటూ టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బైఠాయించిన విద్యార్థులు

టెక్కలి: విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా వారి ఫీజులు చెల్లించుకొనేందుకు ఇవ్వాల్సిన విద్యా దీవెన నిధులను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు కళాశాలలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. మరోపక్క కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన పేరుతో స్పెషల్ ఫీజుల వసూలు ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలో విద్యార్థులు ఉద్యమ బాట పడుతున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కదం తొక్కారు. విద్యా దీవెన నిధులు విడుదల చేయకపోవడం, మరోవైపు కళాశాల వార్షిక ఫీజులు చెల్లించాలని ఆదేశాలు రావడం, స్పెషల్ ఫీజుల వసూళ్లు తదితర సమస్యలపై ఆ కాలేజీ విద్యార్థులు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం ఆందోళనను ఉధృతం చేశారు. ఈ ప్రభుత్వానికి మద్యం, ఇసుకపై ఉన్న శ్రద్ధ విద్యా వ్యవస్థపై లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాలలో బైఠాయించారు. విద్యా దీవెన నిధులు విడుదల చేయకపోతే తాము ఫీజులు చెల్లించబోమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంతే కాకుండా ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతుల కల్పన పేరుతో స్పెషల్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వారికి ఎస్ఎఫ్ఐ సహా పలు విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. మూడు రోజులుగా నిరసన తెలుపుతున్నప్పటికీ ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై విద్యార్థులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తక్షణమే నిధులు విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వెంటనే నిధులు విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వ పెద్దలు మద్యం, ఇసుక ఆదాయంపై మాత్రమే దృష్టి పెడుతున్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన నిధులు అందజేయాలనే చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాల పేరుతో స్పెషల్ ఫీజులు వసూలు చేయడం దారుణం. ప్రభుత్వం వెంటనే విద్యా దీవెన నిధులు ఇవ్వాలి. స్పెషల ఫీజులు ఉపసంహరించుకోవాలి.

– యు.దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

ఐపీఎల్ సెలక్షన్ ట్రయల్స్‌కు ప్రసాద్



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన సింగుపురం దుర్గ నాగ వరప్రసాద్ ఐపీఎల్ అవకాశానికి చేరవయ్యాడు. బెంగళూరు వేదికగా ఈ నెల 17 నుంచి జరుగుతున్న అంతర్‌రాష్ట్ర అండర్-25 పి.రామచంద్రరావు ట్రోఫీలో ఆంధ్రా జట్టు తరఫున రాణిస్తున్న ఎస్‌డీఎస్‌వి ప్రసాద్‌కు ఐపీఎల్ కింగ్స్ లెవన్ పంజాబ్ నుంచి సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరుకావాలని పిలుపొచ్చింది. జలుమూరుకు చెందిన ఈ కుర్రాడు వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా ఇటీవలి కాలంలో మెరుగ్గా రాణిస్తున్న సంగతి తెలిసిందే.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఏర్పాటు

శ్రీకాకుళం: రాజ్యాంగం ప్రసాదించిన మానవ హక్కుల పరిరక్షణకు అన్ని ప్రజాసంఘాలతో కలిసి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఏర్పాటు చేస్తున్నామని వేదిక ప్రతినిధి పేడాడ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేర్వేరు సంఘాల పేరుతో హక్కుల రక్షణ కోసం పనిచేస్తూనే ఒక ఐక్యవేదిక ఏర్పాటు చేయాలని మేధావుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వేదిక కన్వీనర్‌గా బొడ్డేపల్లి మోహనరావు, సభ్యులుగా కె.రామగోపాల్ (సామాజిక న్యాయ పోరాట సమితి), చింతాడ కృష్ణారావు (అరసం), డి.గణేష్ (ఎస్ఎస్‌పీయస్), పేడాడ కృష్ణారావు (డీటీఎఫ్), వంకల మాధవరావు (ఏఐకేఎంఎస్), చల్లా శాంతారావు(ఆదివాసీ జేఏసీ), పంచాది పాపారావు (రైతు సంఘం), సీర రమేష్ (బహుజన టీచర్స్ అసోషియేషన్), కె.వి.జగన్నాథరావు (మానవ హక్కుల వేదిక), మిస్కా కృష్ణయ్య (కేఎన్‌పీఎస్), మద్దిల వినోద్ (పీడీఎస్యూ), బి.మురళీకృష్ణ(ఎస్సీ, ఎస్టీ లాయర్స్ యూనియన్), మద్దెల మాధవరావు (ఏఐకేఎం), ఎస్.ఈశ్వరరావు (ఏపీయూడబ్ల్యూజే), ఎంవీ మల్లేశ్వరరావు (సామ్నా), గౌరవ సలహాదారునిగా నల్లి ధర్మారావును ఎన్నుకున్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆ శాఖ ఎస్‌ఈని ఆదేశించారు. జిల్లాలో నిర్మిస్తున్న వివిధ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి మంగళవారం సమీక్షించారు. బిల్లులు పెండింగులో ఉంటే జాబితాను అందజేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ నూతన కలెక్టరేట్ నిర్మాణం పనుల వివరాలను ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ కలెక్టర్‌కు వివరించారు.కోడి రామమూర్తి మైదానానికి సంబంధించి డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. గార మండలం వనితమండలం – పోలాకి కనెక్టివిటీ హై లెవల్ క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పోలీసు స్టేషన్, ఎంపీడీఓ ఆఫీసు, తదితర కార్యాలయాలు మార్చాల్సి ఉందని, భూ సేకరణకు చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. అనంతరం కళింగపట్నం – శ్రీకాకుళం – పార్వతీపురం రోడ్డుపై సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని పనులపైనా చర్చించారు. సమావేశంలో ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, ఈఈ, డీఈలు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అడహక్ తహసీల్దార్లుగా పదోన్నతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ విభాగంలో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ విధానంలో తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం కలెక్టరేట్ జి సెక్షన్ సూపరింటెండెంట్ జి.ఎల్.ఈ. శ్రీనివాసరావు, హెచ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.చక్రవర్తిలకు కలెక్టరేట్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లోనే ఉంచి పదోన్నతి కల్పించారు. వీరిద్దరూ సీనియారిటీ జాబితాలో ముందున్నారు. ఆరు నెలల కిందటే పదోన్నతి రావాల్సి ఉన్నా.. అప్పట్లో డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీకి వీరి పేర్లు సిఫారసు చేయడంలో జాప్యం జరిగింది.

అట్టహాసంగా సెపక్‌తక్ర పోటీలు ప్రారంభం

- రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన క్రీడా జట్లు
- క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లిన ఆతిథ్య శ్రీకాకుళం



నిర్వాహకులు, అతిథుల సమక్షంలో క్రీడాజ్యోతిని చూపిస్తున్న సెపక్‌తక్ర జాతీయ క్రీడాకారులు



హోరాహోరీ పోరులో కర్నూలు జిల్లా క్రీడాకారుడి విన్యాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వలమైన భవిష్యత్తు సొంతం చేసుకోవచ్చని శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి. పద్మావతి అన్నారు. జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో 34వ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) సీనియర్స్ పురుషులు, మహిళల సెపక్‌తక్ర చాంపియన్‌షిప్-2024 పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సెపక్‌తక్ర జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పోటీలను విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందు జరిగిన వివిధ జిల్లాల క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్, పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెపక్‌తక్ర సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, సీఐ ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌వీడీ మురళికృష్ణ, ట్రాఫిక్ జామ్ శ్రీనివాస్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్స్ ఎండీ కాసీంఖాన్, కళావతి, రాజు, బాలమురళి, వేణుగోపాల్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 15 జిల్లాల క్రీడా జట్లు ప్రాతినిధ్యం వహించారు. తొలిరోజు ఆతిథ్య శ్రీకాకుళం జట్లు పురుషులు, మహిళల విభాగాల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి.